ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

సోమవారం 26 ఆగస్టు 2024







చెక్కులను అందించిన కలెక్టర్‌ నాగరాణి

లఖ్‌పతి దీదీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం టౌన్, ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల సభ్యులను లక్షాధికారులను చేయాలని వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో దేశ ప్రధాని నరేంద్రమోదీ లఖ్‌పతి దీదీ పథకాన్ని తీసుకు వచ్చినట్టు కలెక్టర్‌ నాగరాణి తెలిపారు. మహారాష్ట్రలోని జెల్గాన్ నుంచి ఆదివారం ప్రధాని ఈ కార్యక్రమం ప్రారంభించగా భీమవరం కలెక్టరేట్‌ వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌ నుంచి కలెక్టర్‌ పాల్గొన్నారు. కలెక్టర్‌ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కూడా మహిళలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాన్ని ఉపయోగించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. జిల్లాలో 736 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.90.51 కోట్ల బ్యాంకు రుణాలకు సంబంధించిన చెక్‌లను కలెక్టర్‌ పంపిణీ చేశారు. డీఆర్వో జె.ఉదయ భాస్కర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, డీఆర్‌డీఏ సిబ్బంది కుసుమ కుమారి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీనివాస ప్రసాద్, డీఆర్‌డీఏ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రేవు పాటపై సిండికేట్ల కన్ను

ఈనెల 28న పాట



నరసాపురం, ఆగస్టు 25: మాధవాయిపాలెం రేవు పాటపై సిండికేట్ల కన్ను పడింది. ఈనెల 28న మండల పరిషత్‌లో నిర్వహించే పాటను పోటీ లేకుండా దక్కించు కునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రేవు పాట ప్రారంభ ధరను రూ.3.62 కోట్లు నిర్ణయించారు. మూడు సార్లు టెండర్‌ నోటిఫికేషన్‌ ఇచ్చినా ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దీనికి కారణం పాటదారులంతా సిండికేట్‌ అయ్యారన్న వాదనలు వినిపించాయి.దీంతో ప్రభుత్వం పాట ప్రారంభ ధరను రూ.66 లక్షలు తగ్గించి రూ.2.97కోట్లుకు నోటిఫికేషన్‌ జారీచేసింది. ఒక్కసారిగా పెద్ద మొత్తంలో ప్రారంభ ధర తగ్గడం, రేవు రోజువారీ ఆదాయం కూడా పెరగడంతో పాటలో పాల్గొనాలని పలువురు నిర్ణయించారు. శుక్రవారం ఒకే రోజు ఆరుగురు పాటదారులు టెండర్‌ ఫారాలు కొనుగోలు చేయడం చేశారు. వీరంతా పాటలో విడివిడిగా పాల్గొంటారా ? లేక సిండికేట్‌గా టెండర్లు వేస్తారా? అన్న చర్చ నెలకొంది. ఈసారి ఏలాగైనా రేవు పాటను దక్కించుకోవాలని పలువురు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో అధికార పార్టీలకు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రేవు నిర్వహణ అంతా వైసీపీ అనుకూల వ్యక్తులే నిర్వహించారు.

రేపు కాళ్లకూరు వెంకన్న ఆలయం మూసివేత

కాళ్ల, ఆగస్టు 25 : కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయం 27వ తేదీ మంగళవారం వైష్ణవ శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్లు దేవస్థానం ఈవో అరుణ్‌కుమార్‌ ఆదివారం తెలిపారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారి దేవాలయం తెరుస్తారన్నారు. రాత్రి 7 గంటలకు స్వామి వారికి 12 రకాల విశేష ప్రసాదాలు నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించనున్నట్లు తెలిపారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న భీమవరం టూటౌన్‌ సీఐ కాళీచరణ్‌

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు

జిల్లాలో హోటల్స్, లాడ్జిలు, క్లబ్‌లపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

భీమవరం క్రైం, ఆగస్టు 25 : చట్టవ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు జిల్లాలో తావు లేకుండా చేసేందుకు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్‌ నయీం అస్మి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న హోటల్స్, లాడ్జిలు, క్లబ్‌లలో ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు . జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. హోటల్స్‌లో నిర్వహిస్తున్న రికార్డ్స్ , సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. వివిధ పోలీస్‌ స్టేషనలలో ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని లేకుంటే చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని పోలీస్‌ అధికారులు హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మధ్యంతర భృతి ప్రకటించాలి

7

జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతల డిమాండ్

జయహో వందేభారత్

ఏలూరులో హాల్ట్.. ప్రారంభించిన మంత్రి కొలుసు, ఎంపీ పుట్టా



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు, ఎంపీ పుట్టా, ఎమ్మెల్యేలు

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : వందేభారత్ రైలు ఏలూరులో ఆగింది. ఆదివారం నుంచి హాల్ట్ ప్రారంభమైంది. ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌ కుమార్‌ యాదవ్‌ హాల్ట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని రైలుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి రైలును ప్రారంభించారు. వైజాగ్‌ నుంచి సాయంత్రం 5.54 నిముషాలకు ఏలూరుకు వచ్చి 5.55 నిముషాలకు విజయవాడ వైపు బయలుదేరి వెళ్లాల్సి ఉంది. అయితే ఆదివారం సాయంత్రం 6.08 నిముషాలకు రాగా ప్రారంభోత్సవం పూర్తి చేసుకుని 6.17 నిముషాలకు విజయవాడ వైపు వెళ్లింది. ఈ సందర్భంగా ఎంపీ మహేశ్‌ యాదవ్‌ మాట్లాడుతూ వందే భారత్‌కు ఏలూరులో హాల్ట్ వల్ల జిల్లా ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఏలూరులో స్టాప్‌ ఇచ్చినందుకు ప్రధాని మోదీకి, కేంద్ర రైల్వే మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కొలుసు మాట్లాడుతూ జిల్లాలో వ్యాపారులకు, ఉద్యోగస్తులకు ఈ రైలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్యేలు బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, చింతమనేని ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, సౌత్‌ సెంట్రల్‌ రైల్వే బోర్డు సభ్యుడు గుమ్మడి వెంకట చైతన్య, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, అదనపు డివిజనల్‌ మేనేజర్‌ టీఈ ఎడ్విన్, సీనియర్‌ డీఈఈ టి.సురేష్, సీనియర్‌ డీవోఎం సత్యస్వరూప్, సీనియర్‌ డీఎస్టీఈ ఎండీ ఆలీఖాన్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఏలూరు నగరపాలక కోఆప్షన్‌ సభ్యుడు పెదబాబు, ఎంఆర్‌డీ బలరామ్, స్టేషన్‌ మేనేజర్‌ రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మహేశ్, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌ రైలు ఎక్కి విజయవాడ వరకు ప్రయాణించారు.

ఆర్బీకేల్లో అక్రమాలకు చెక్





- ఎరువుల అమ్మకాలు నిలిపివేత
- సొసైటీలు, డీలర్లకు సరఫరా
- గతంలో ఎన్నో అడ్డదారులు
- యూరియా పక్కదారి..డీలర్లకు విక్రయం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల విక్రయానికి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. వైసీపీ హయాంలో లక్ష్యాలను నిర్దేశిస్తూ ఎరువుల విక్రయాలు చేపట్టారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి అడ్డదారులు తొక్కాల్సి వచ్చింది. తాజాగా ప్రభుత్వం ఎరువుల అమ్మకాలను నిలిపివేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న విమర్శలు ఉన్నాయి. లక్ష్యాలను చేరుకోవడానికి క్షేత్రస్థాయిలో రిటైల్‌ డీలర్లకు అమ్మేవారు. ప్రధానంగా యూరియా పక్కదారి పట్టేది. రైతులు కొనుగోలు చేసుకునేవారు కాదు. డీలర్లే కొనుగోలు చేశారు. రైతు పేరుతో నమోదు చేసేవారు. ఆ సొమ్మును ప్రభుత్వానికి తిరిగి చెల్లించడానికి సమయం పట్టేది. కొన్ని కేంద్రాల్లోనే ఇలాంటి దుస్థితి ఉండేది. సక్రమంగా అమ్మకాలు సాగించే కేంద్రాల్లో సిబ్బంది తీవ్ర ఒత్తిడికి లోనయ్యేవారు. దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు సరికదా రైతు భరోసా కేంద్రాలు తప్పుడు మార్గంలో పయనించే పరిస్థితిని కల్పించారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం చెక్‌ పెట్టింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల అమ్మకాలను నిలిపివేసింది. వైసీపీ ప్రభుత్వం నిర్ణయం వల్ల అప్పట్లో కంపెనీలు కూడా ఇబ్బందులు పడేవి. ప్రభుత్వానికి 50 శాతం ఎరువులను కేటాయించేవి. ముఖ్యంగా రైతులు కొనుగోలు చేసే యూరియా, కాంప్లెక్స్‌ రకాలనే ఆర్బీకేలకు ఇచ్చేవారు. వాస్తవానికి డీలర్లకు సరఫరా చేస్తే యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులను కూడా కంపెనీ ప్రతినిధులు కట్టబెట్టే వారు. కంపెనీలు లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇలా డీఏపీతో పాటు, జిల్లాలో అంతగా మక్కువ చూపని రకాలు కూడా కంపెనీలు విక్రయించుకునేవి. రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేయడం వల్ల ఇతర ఎరువులు అమ్మకం సాధ్యమయ్యేది కాదు. ఇలా అన్ని వర్గాలు ఇబ్బందులు పడ్డాయి. మరోవైపు డిమాండ్‌ ఉన్న రకాలను రైతు భరోసా కేంద్రాలకు ఇవ్వడం వల్ల నేరుగా రిటైల్‌ డీలర్లకు ఇచ్చేసేవారు. దీనివల్ల కొంత మంది సిబ్బంది కూడా లబ్ధి పొందారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మరోవైపు ప్రభుత్వానికి ఇప్పటికీ బకాయిలు న్నాయి. జిల్లాలో మాత్రం చెల్లించాల్సిన సొమ్ములపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తెచ్చేవారు. దాంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది నానా ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆ కష్టాలన్నీ తొలగిపోయాయి. అక్రమ అమ్మకాలకు అడ్డుకట్ట పడింది. రైతుల పేరుతో రిటైల్‌ వ్యాపారులకు మాత్రమే లబ్ధి చేకూరేది.

ఇప్పుడు సొసైటీలు, డీలర్లకే సరఫరా

ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ ద్వారా సొసైటీలకు ఎరువులు సరఫరా చేస్తోంది. జిల్లాలో యూరియాతోపాటు, ఇటీవల కాలంలో డీఏపీ వినియోగం పెరిగింది. కాంప్లెక్స్‌ ఎరువులపై రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. రబీలో 20-20-20 కి డిమాండ్‌ ఉన్నా కొన్ని కంపెనీలపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్క్‌ఫెడ్‌ వాటిని మాత్రమే తీసుకుంటోంది. యూరియాతో పాటు, డీఏపీని వినియోగిస్తోంది. సొసైటీలకు సరఫరా చేస్తోంది. సొసైటీలు రైతులకు రుణాల రూపంలో ఎరువులను విక్రయిస్తున్నారు. తొలుత పెట్టుబడి లేకుండా తక్కువ వడ్డీతో రైతులకు ఎరువులు లభ్యమవుతున్నాయి. కంపెనీలు మాత్రం అన్ని రకాల ఎరువులు విక్రయానికి ఆసక్తి చూపుతున్నాయి. జిల్లాకు ఇండెంట్‌ పెడుతున్నాయి. నానో ఎరువులు కూడా జిల్లాలో డంప్‌ చేస్తున్నాయి. వీటిని రైతులు అంతగా ఉపయోగించడం లేదు. ఆర్గానిక్‌ ఎరువులను కూడా ఎరువుల పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్నాయి. తక్కువ ధరకే మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్నాయి. అయినా రైతులు ఆర్గానిక్‌ ఎరువులపై మొగ్గుచూపడం లేదు. నానో ఎరువులను వినియోగించడం లేదు. వాటిని అమ్ముకోవడానికి పరిశ్రమల ప్రతినిధులు నానా తంటాలు పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడుతున్నారు.లక్ష్యాలను చేరుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. బ్లాక్‌ మార్కెట్‌ను అరికట్టడానికి ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను వినియోగించుకుంటోంది. ఎరువులను కొనుగోలు చేసి సొసైటీలు, డీసీఎంఎస్‌లకు పంపిణీ చేస్తోంది. ఎరువుల ధరలు పెరిగిన తర్వాత బ్లాక్‌ మార్కెట్‌కు అవకాశం లేదు. గడచిన పదేళ్లలో జిల్లాలో మిగులు ఎరువులు అధికంగా ఉంటున్నాయి. లక్ష్యానికి మించి ఎరువులను డంప్‌ చేస్తున్నాయి.

తగ్గిన ఎరువుల వినియోగం

రైతులు ఇటీవల కాలంలో ఎరువుల వినియోగాన్ని తగ్గించారు. తద్వారా దోమలు వంటి చీడపీడలు తగ్గుముఖం పడుతున్నాయి. జిల్లాలో ఎరువుల అమ్మకాలు కూడా తగ్గాయి. మరోవైపు దిగుబడులు అధికమయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో మార్క్‌ఫెడ్‌ సైతం ఆచితూచి అడుగులు వేస్తోంది. రైతుల వద్ద డిమాండ్‌ ఉన్న రకాలనే తీసుకుంటోంది. వ్యవసాయ శాఖ కూడా వాటినే మార్క్‌ఫెడ్‌కు కేటాయిస్తున్నారు. లేదంటే ఎరువుల నిల్వలు ఉండిపోతున్నాయి. వాటిని వదిలించుకోవడానికి మార్క్‌ఫెడ్‌ ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఫలితంగా డిమాండ్‌ ఉన్న ఎరువులపైనే దృష్టి పెట్టింది. సొసైటీలకు కూడా వాటినే పంపిణీ చేస్తోంది. దాంతో జిల్లాలో కాంప్లెక్స్, డిఏపి వంటి ఎరువులు రైతులకు పుష్కలంగా అందుతున్నాయి. జిల్లాలో ముందుగానే అవసరమైన ఎరువులకు ప్రణాళిక చేసుకుంటున్నారు. ముందస్తుగానే ఇండెంట్‌ పెడుతున్నారు. ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తోంది. జిల్లాకు అవసరమైన ఎరువులను కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. మరోవైపు ఇండెంట్‌తో సంబంధం లేకుండా కంపెనీలే ఇక్కడ బఫర్‌ స్టాక్‌లు పెడుతున్నాయి. దాంతో జిల్లాలో ఎరువులకు ఇబ్బంది లేకుండా పోయింది. ఒక్కోసారి యూరియాకే డిమాండ్‌ ఉంటోంది. ఇటీవల రైతులు యూరియా వినియోగాన్ని పెంచేశారు. కాంప్లెక్స్‌ ఎరువుల ధరలను తట్టుకోలేక దానిని అరికట్టడానికి వ్యవసాయ శాఖ అధికారులు నానా అవస్థలు పడ్డారు. రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రీయ సాగుపై దృష్టి మరలుస్తున్నారు. జిల్లాలో క్లస్టర్‌లను ఏర్పాటు చేసి సాగు చేయిస్తున్నారు. మొత్తంపైన ఎరువుల వినియోగం తగ్గడం కూడా జిల్లాలో సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తడం లేదు.

స్థానికోత్సాహం!



కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో కుదురుకుంటున్న స్థానిక సంస్థలు

- గ్రామసభలతో సర్పంచ్‌ల్లో కొత్త హుషారు
- పంచాయతీరాజ్‌లో క్రమేపీ తొలగుతున్న నిరాశ, నిర్వేదం
- పవన్‌ చొరవ పట్ల పల్లెల్లోను మద్దతు
- ఇక ఈసారి జిల్లా పరిషత్‌ వంతు
- త్వరలోనే జడ్పీకి సకల మోక్షాలకు అవకాశం
- మునిసిపాలిటీల్లోను ఇప్పటికే కొత్తదనం

గడిచిన ఐదేళ్లపాటు వ్యవస్థలన్నీ నిర్వీర్యం. స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల హక్కులను కాలరాయడంలో వైసీపీ ఎక్కడలేని ఉత్సాహం చూపింది. ఊరికే రాజు అయిన సర్పంచ్‌ని అన్ని కార్యక్రమాలకు దూరం చేసింది. జడ్పీటీసీలు, ఎంపీటీసీల పరిస్థితి ఇదే. మునిసిపల్, కార్పొరేషన్‌లలో కొంత పాలన సాగినా నిధులు నిల్. కూటమి ప్రభుత్వం రెండు నెలల్లోనే స్థానిక సంస్థలకు తిరిగి కొత్త శోభ సంతరించుకునేలా రంగం సిద్ధం చేస్తోంది. కొన్నింటిని ఇప్పటికే రంగంలోకి తెచ్చింది.

– ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

గతమంతా.. చేదే..

స్థానిక సంస్థలన్నీ గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టేశారు. సమాంతరంగా గ్రామ, వార్డు సచివాలయాలను తెచ్చి వలంటీర్లకు పెత్తనం అప్పగించారు. 13, 14 ఆర్థిక సంఘం నిధులను నేరుగా పక్కదారి పట్టించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వందల కోట్లు దారి మళ్ళాయి. సర్పంచ్‌లు, స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన మిగతా ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని నిలిపివేశారు. ఇంకో విచిత్రం ఏమిటంటే వైసీపీ పాలనలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగ్గా అత్యధికులు ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ఆ పార్టీ అనుకూలురే ఎక్కువ సంఖ్యలో విజయం సాధించారు. తీరా అధికారంలోకి వచ్చాకా ఏమీ చేయలేకపోతున్నామన్న నిస్పృహలో వారంతా కుంగిపోయారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఏకంగా సర్పంచ్‌లతో తలపడే స్థాయికి ఎదిగారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యేలు ఎవరూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే కనీస ప్రయత్నమూ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పంచాయతీరాజ్‌ వ్యవస్థపై ఆ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌ ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇన్నాళ్ళు సర్పంచ్‌ అంటే గుర్తులేని గ్రామాలకు తాజాగా జరిగిన ఉపాధి హామీ గ్రామ సభలన్నీ సర్పంచ్‌ అధ్యక్షతనే జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉపాధి హామీ కింద ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోపే ప్రణాళికలు రూపొందించుకోవడానికి, అదీ ప్రజల సమక్షంలోనే నిర్ణయించడం ప్రత్యేకించి రూ.230 కోట్ల వ్యయంతో ఒక్క ఏలూరు జిల్లాలోనే ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవడం తాము ఊహించని పరిణామంగా కొందరు సర్పంచ్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. 'పవన్‌ విజన్‌ ఉన్న నాయకుడు. గ్రామ సీమలు ఒక వెలుగు వెలుగొందాలని ఆయన ఆశిస్తున్నారు. ఆ రూపంలోనే మమ్మల్ని మరింత మమేకం చేశారు. ప్రజలను కలుపుకుపోతున్నారు. ఇది శుభపరిణామం' అంటూ సర్పంచ్‌లు కొందరు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. అధికారుల్లోను కదలిక వచ్చి గ్రామస్థాయిలో ఏవేమి చేయాలో ఇప్పటికిప్పుడు పథక రచన చేయడం శుభపరిణామంగానే భావిస్తున్నారు. పల్లెల్లో పట్టు కోసం జల జీవన్‌ మిషన్‌ దగ్గర నుంచి ఇతరత్ర కార్యక్రమాలకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టబోతున్నారు. ఇప్పటికే ఆర్థిక సంఘం నుంచి మరొకసారి నిధులు విడుదలైన తరుణంలో ఈసారి ఈ నిధులను వైసీపీ హయాంలోలా పక్కదారి పట్టించకుండా గ్రామాల అభివృద్ధికే వినియోగించబోతున్నారు.

ఈసారి జిల్లా పరిషత్‌ వ్యవహారం..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలను విభజించింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్‌ ఎన్నికలు జరిగి ఉన్నాయి. ఈ క్రమంలోనే జిల్లా పరిషత్‌ ఇంతకు ముందు మాదిరి కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. ఒక్క పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌ సమావేశం నిర్వహించాలంటే మూడు జిల్లాల కలెక్టర్లు హాజరుకావాల్సి ఉంది. వీరితోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరుకావాల్సి ఉంది. ఇప్పటి వరకు జరిగిన సమావేశాల్లో ఒకరిద్దరు వచ్చినా కేవలం కొంత సమయం మాత్రమే గడిపి నిష్క్రమించారు. ఆఖరుకి అప్పటి ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం యంత్రాంగంలో గందరగోళం సృష్టించింది. ఒకప్పుడు పంచాయతీ రాజ్‌లో కీలక భూమిక పోషించే జిల్లా పరిషత్‌ సైతం బలహీనపడింది. మూడు నెలలకోసారి జరిగే జడ్పీ సమావేశాలు తూతూ మంత్రంగా సాగాయి. ఏలూరు జిల్లా కేంద్రంలో ఉండే జిల్లా పరిషత్‌ తమది కాదన్నట్టు మిగతా జిల్లాల ప్రజాప్రతినిధులు అనేక సమావేశాలకు గత ప్రభుత్వంలో డుమ్మా కొట్టారు. అటు పశ్చిమగోదావరి జిల్లా, ఇటు ఏలూరు జిల్లాలో ఉప ముఖ్యమంత్రులుగా ఉన్న ఆళ్ల నాని, కొట్టు సత్యనారాయణ సైతం జిల్లా పరిషత్‌కు ఒక రూపు తేలేకపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కటంటే ఒక్కటి కూడా మచ్చుకైనా గుర్తుండేలా అభివృద్ధి పని జరగనేలేదు. మండల పరిషత్‌లు సైతం బలహీన పడ్డాయి. దీనికంతటికి కారణం నిధులలేమి,ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు. అటు జిల్లా పరిషత్‌లో వైసీపీ అనుకూలురే అత్యధికంగా గెలుపొందడం తెలుగుదేశం భాగస్వామ్యం కేవలం ఒక్క శాతం లోపే ఉండడం మరో పరిణామం. ఇలాంటి తరుణంలో పంచాయతీరాజ్‌ వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నందున అదే స్థాయిలో జిల్లా పరిషత్‌ కార్యకలాపాలను త్వరలోనే ఒక గాడిన పట్టడానికి కూటమి ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది. పార్టీల వారీగా బలాబలాలను పక్కనపెట్టి క్షేత్రస్థాయిలో ప్రజా సర్వీసులను మరింత వేగవంతం చేయాలనేదే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది.

మునిసిపల్, కార్పొరేషన్‌లోను కొత్త దనం

జిల్లా వ్యాప్తంగా ఉన్న మునిసిపల్, కార్పొరేషన్‌ రెండింటిలోను పాలనా వ్యవహారాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చకచకా పాలనా వ్యవహారాలను చక్కదిద్దుతున్నారు. ఇప్పటికే ఎక్కడికక్కడ అధికారులను మార్చారు. తాజాగా వారంలోపు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిల్లోను పెద్ద ఎత్తున బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే ఏలూరు మునిసిపల్‌ కమిషనర్‌ను మార్చారు. నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో త్వరలోనే ప్రక్షాళన జరగబోతుంది. గడిచిన ఐదేళ్లల్లో వీటన్నింటిలోనూ జరిగిన అవకతవకలన్నింటి పైనా దృష్టి పెడుతున్నారు. ఏలూరు కార్పొరేషన్‌ను స్మార్ట్‌ సిటీగా తీర్చిదిద్దేందుకు గత టీడీపీ పాలనలోనే కీలక నిర్ణయం తీసుకోగా వైసీపీ హయాంలో భ్రష్టుపట్టింది. ఇప్పుడు మరోసారి కూటమి అధికారంలోకి రావడంతో ఇక నగరాన్ని తీర్చిదిద్దడంతోపాటు నూజివీడు మునిసిపాలిటీ, జంగారెడ్డిగూడెం, చింతలపూడి నగర పంచాయతీలను చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పచ్చదనం వెల్లివిరిసేలా చూస్తానని అటవీ శాఖ మంత్రి పవన్‌ కళ్యాణ్‌ ప్రకటించారు. నగరవాసులు శభాష్‌ అనేటట్టుగా అన్ని నగరాలు, పట్టణాల్లోను మొక్కలు పెంచి తీరుతామని ఆ మేరకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంకోవైపు పట్టణ, నగరవాసుల్లో చైతన్యం నింపేందుకు ఆన్‌లైన్‌ పద్ధతిలోనే పన్ను చెల్లింపులను వేగవంతం చేస్తున్నారు. ఇలా ఒక్కొక్కటిగా స్థానిక సంస్థల్లో పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.



ప్రతి ఇంటికీ కుళాయి

మున్సిపాల్టీల్లో డ్రింక్‌ ఫర్‌ ట్యాప్‌ (డీఎఫ్‌టీ) సర్వే

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు

భీమవరం టౌన్, ఆగస్టు 25 :జిల్లాలోని అన్ని మునిసిపాల్టీల్లో డ్రింక్‌ ఫర్‌ ట్యాప్‌ (డీఎఫ్‌టీ) పేరిట సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్‌ అందించాలనే ధ్యేయంతో డీఎంఏ హరినారాయణ ఆదేశాలపై పది రోజులుగా ఈ సర్వే చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ రూపొందించారు. మునిసిపాల్టీల వారీగా గణన చేస్తున్నారు. ఒక ఇంటిలో ఒకే కనెక్షన్‌ ఉంటే ఎంతమంది ఉపయోగించుకుంటున్నారు ? కనెక్షన్‌ ఉందా..లేదా ? లేకపోతే కారణం.. వంటి వివరాలను నమోదు చెయ్యాల్సి ఉంది. మొదట్లో సాంకేతిక ఇబ్బందులు కారణంగా అను కున్నంత స్థాయిలో సర్వే జరగలేదు. నెలాఖరు నాటికి సర్వే పూర్తికావాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.


అమృత్‌ 2.0 నిధులతో..

ప్రస్తుతం జిల్లాలో అమృత్‌ పథకం కింద భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో ఫేజ్‌-1లో మంచినీటి పైపు లైన్‌ పనులు చేపట్టగా ప్రస్తుతం పథకం ముగిసిపోయే సమయం వచ్చింది. మిగతా మునిసిపాల్టీల్లో ఏషియన్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఇన్‌ బ్యాంకు ద్వారా మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయి. అమృత్‌- 2.0 కింద మునిసిపాలిటీల్లో మంచినీటి పనులు చేపట్టే ప్రతిపాదనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సర్వే చేపడుతున్నారు. మునిసిపాల్టీలల్లో ఎంతమందికి కుళాయి కనెక్షన్‌ ఉంది ? ఎంతమందికి లేదు అనే సమాచారం రాష్ట్రస్థాయి అధికారులకు చేరతుంది. దీని ఆధారంగా భవిష్యత్తులో అందరికి కూళాయి ద్వారా నీరు అందించే ప్రక్రియను చేపట్టే అవకాశం కలుగుతుంది. ఎవరైనా కనెక్షన్‌ వేసుకుని పన్నులు రాకపోయినా, దొంగ కనెక్షన్‌లు ఉన్నా ఈ సర్వేలో బట్టబయలు కావడంతో పాటు వాటిని రెగ్యులర్‌ చేసి మునిసిపాల్టీకి ఆదాయం పెంచే అవకాశం ఉంటుంది.

మునిసిపాల్టీల వారీగా సర్వే వివరాలు

మునిసిపాల్టీ	అసెస్‌మెంట్లు	పూర్తయినవి	శాతం
భీమవరం	41,836	35,701	83.34
నరసాపురం	17,279	17,279	100
పాలకొల్లు	17,749	17,577	99.03
తాడేపల్లిగూడెం	27,418	25,875	94
తణుకు	24,668	24,668	100

సెప్టెంబరు 22 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు




త్వరలోనే వంద పడకల ఆస్పత్రి

మంత్రి నిమ్మల రామానాయుడు

ఈఎస్‌ఐ ఆస్పత్రికి సుస్తీ

కార్మికులకు అవస్థలు 7



త్వరలోనే వంద పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తాం : మంత్రి నిమ్మల



రోగులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, ఆగస్టు, 25 : పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం సందర్శించారు. వార్డులలో పర్యటించి రోగులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాటాడారు. బాలింతల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యులను, సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణపనులను తొందరగా పూర్తి చేయాలనీ, ఈలోపుగా కొత్త భవనంలో ఎమెర్జెన్సీగా నాలుగు వార్డులను పూర్తిచేసి ఇవ్వాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ వార్డుల్లోకి ఇన్ పేషెంట్లను తరలించి వైద్య సేవలందించాలని మంత్రి నిమ్మల వైద్యులకు సూచించారు. ఆస్పత్రి చుట్టూ మొక్కల నాటాల న్నారు. అనంతరం మంత్రి నిమ్మల విలేకర్లతో మాట్లాడుతూ వంద పడకల ఆస్పత్రి భవనాన్ని త్వరి తగతిన పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన భవన నిర్మాణం జగన్ రావడంతో ఐదేళ్లలో కూడా పూర్తికాని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కార్పొరేషన్ ఈఈ బీవీ గిరి, డీఈ ఎం.శ్రీనివాసరెడ్డి, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ఒ.రవి కుమార్, వైద్యులు అనిత, సుధీర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవీ, కృష్ణా జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి భిక్షగాడు మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదవుట పల్లి రైల్వే పోలీస్ స్టేషన్ దగ్గరలో విజయవాడ ఇంచిపేట రామ్‌గోపాల్‌సత్రం వీధిన కు చెందిన ఈభూది నాగరాజు (48)కి వివాహం కాలేదు. 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ ప్రతిరోజు రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి, కాకినాడ, తిరుపతి రైళ్లల భిక్షాటన చేస్తూ జీవిస్తాడు. తనతోటి అంధుడైన బొమ్మిని గుర్రప్పతో కలిసి రత్నాచల్ జనరల్ భోగీ ఎక్కి భిక్షాటన చేస్తున్నారు. పెద్దవుటపల్లి వద్ద ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందాడు. ఈసమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

ఉండి ఆగస్టు 25: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి వారం రోజులు తరువాత ఇంటికి దగ్గరలో ఉన్న పంట బోదెలో మృతదేహం కనిపించడంతో అనుమానా స్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు ఉండి పోలీసులు ఆదివారం తెలిపారు. ఉండి మండలం పాందువ్వ గ్రామ శివారు ఖండ్రికకు చెందిన పసుపులేటి ప్రభాకరరావు (40) మతి స్థిమితం లేక పోవడంతో ఈ నెల 17వ తేదీ రాత్రి నుం చి కనిపించడం లేదని భార్య సీతామహాలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి బంధు వులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఎటువంటి ఆచూకీ లభిం చలేదు. ఆదివారం ఉదయం గ్రామంలోని దగ్గరలో ఉన్న పంట కాలువలో ప్రభాకరరావు మృతదేహం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు దానిని గమనించి సీతామహాలక్ష్మీకి సమాచారం అందించారు. ఈ మృతిపై సీతామహాలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ నజీరుల్లా తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న భగ్న ప్రేమికుడు



చిర్రా వెంకీ (ఫైల్)

పెనుమంట్ర, ఆగస్టు 25 : ఓ భగ్న ప్రేమికుడు ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెను మంట్ర పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి పెను మంట్ర మండలం పాలమూరు అరుంధతి పేటకు చెందిన చిర్ర నరేష్ కుమారుడు చిర్రా వెంకీ (19) తండ్రి మరణిం చడంతో చిన్నాన్న సంరక్షణలో ఉన్నాడు. తల్లి జీవనో పాధి నిమిత్తం గల్ఫ్ దేశాలు వెళ్ళింది. మొగల్తూరు మండలం కాళీ పట్టణానికి చెందిన యువతిని కొంతకాలంగా వెంకీ ప్రేమిస్తున్నాడు. ఇరువురు పెద్దలు ప్రేమికులు మైనర్ల కావడంతో మేజర్లు అయ్యే వరకు వేరువేరుగా ఉండా లని నిర్ణయించారు. నెల క్రితమే ఇరువురు మేజర్లయ్యారు. కొద్ది రోజుల్లోనే పెళ్లి చేసుకోవాలని భావించారని ఇంతలోనే యువతికి పెళ్లి కుదిరిందని తెలియడం తో ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు రోదిస్తున్నారు. ఈ సంఘటనపై మృతుడి నాయనమ్మ సువార్త పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెనుగొండ ఇన్‌చార్జి ఎస్ఐ కుప్పిశెట్టి గంగాధర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : మనవడిని కొడుతున్నారని అడ్డు వెళ్లిన తాతను కొ ట్టి ఆపై మోటార్ సైకిల్‌తో ఢీకొనడంతో తీవ్రగాయాలు పాలై ఏలూరు ప్రభుత్వా స్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వడ్డెర గూడెంకి చెందిన వేముల బోడి బాబు (75) మనవడిని అదే ప్రాంతానికి చెందిన శ్రీను అనే వ్యక్తి పది రోజుల క్రితం కొడుతుం డగా బోడు బాబు అడ్డు వెళ్ళాడు. అతనిని కూడా కొట్టారు. అంతే కాకుండా శ్రీను సోదరుడు ధనరాజు మోటార్ సైకిల్‌తో అతివేగంగా వచ్చి బోడు బాబును ఢీకొ న్నాడు. దీంతో తీవ్రగాయాల పాలైన బోడు బాబుని ఒక్క ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పి ంచారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు ఈ ఘర్షణ ఘటనపై ఇంతకుముందే వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయ గా ఇపుడు హత్య కేసుగా మార్పు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమి త్తం ఆస్పత్రి మార్చురికి తరలించారు.

ఆలమూరులో చోరీ

పెనుమంట్ర, ఆగస్టు 25 : మండలంలోని ఆలమూరులో ద్వారంపూడి వెంకటరెడ్డి పక్క పోర్షన్‌లో కొడుకు అనారోగ్యంతో ఉన్నాడని ఇంటికి తాళం వేసి తోడుగా పడుకున్నారు. ఉదయం వచ్చిన వెంకటరెడ్డికి తన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీలో ఐదు కాసులు బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరణకు గురైందని పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ చోరీకి పాల్పడిన ప్రాంతాల్లో వేలి ముద్రలు సేకరించారు. ఇంటి తలుపు బద్దలు కొట్టి ఈ చోరీకి పాల్పడినట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు పెనుమంట్ర ఇన్‌చార్జి ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఏడుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 25 : ఓ ప్రేమ పెళ్ళి వ్యవహారంలో యువతి బంధువులు మైసన్నగూడెంలో శనివారం మంద పాటి రాజు, అతని తల్లి, మేనత్తపై చేసిన దాడి ఘటనలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. అరెస్టయిన వారిలో పారేపల్లి నరేంద్ర, పారేపల్లి నాగార్జున, బల్లే విజయ్‌కుమార్, కొప్పుల శ్రీను, మనికే నాగేశ్వరరావు, చిట్టిబోయిన జగదీష్, సాకిరి వెంకన్న ఉన్నట్లు ఆయన తెలి పారు. వీరిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు పంపను న్నట్లు ఎస్సై చెప్పారు.

ఒకనికి కత్తిపోట్లు

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : ఏలూరు రూరల్ మండలం సుం కర వారి తోటకు చెందిన సర్కస్ చేసుకునే భవాని చంటితో అదే ప్రాంతానికి చెందిన వారి బంధువులు ఆదివారం రాత్రి గొడవకు దిగారు. ఈ గొడవలో భవాని ఏసు, భవాని బాలు, సఖి అనే ముగ్గురు కలిసి కత్తితో చంటిని పొడిచారు. దీంతో తీవ్ర గాయా లపాలైన చంటిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరు గైన చికిత్స నిమిత్తం వైద్యులు విజయవాడకు రిఫర్ చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మిస్సింగ్ కేసు నమోదు



ఎన్.దావీదు (ఫైల్)

కాళ్ళ, ఆగస్టు 25 : భర్త కనిపించడం లే దంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సి ంగ్ కేసు నమోదు చేసినట్లు కాళ్ళ పోలీ సులు ఆదివారం తెలిపారు. కాళ్ళ మండలం మేకల దిబ్బకి చెందిన ఎన్.దావీదు శనివారం భీమవరం వెళ్ళి వస్తానని తిరిగి ఇప్పటి వర కు ఇంటికి రాకపోవడంతో భార్య మరియ మ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.శ్రీని వాసరావు కేసు నమోదు చేసినట్లు తెలిపా రు. ఫోటోలో వ్యక్తి కనిపిస్తే 94407 96649 సమాచారం ఇవ్వాలని కోరారు.

పరామర్శ

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : ద్వారకాతిరుమల మండలం మద్ది వారిపల్లెకు చెందిన మద్దిరావమ్మపై బంధువులే చేతబడి చేస్తుం దని అనుమానంతో ఆమెను కొట్టి పళ్ళు పీకేశారు. ప్రస్తుతం ఏ లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెను ఆదివారం రాత్రి మూఢ నమ్మకాల నిర్మూలన సంఘ జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ పరామర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

» రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి » బహుళ సంఘాల్లో సభ్యత్వాలను ప్రభుత్వమే రద్దు చేయాలి » జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు అర్బన్, ఆగస్టు 25 : ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తక్షణమే మధ్యంతర భృతి(ఐఆర్)ని ప్రభుత్వం ప్రకటించాలని ఏపీజేఏసీ-అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏలూరులో జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం జరిగాయి. ఈ రెండు కార్యవర్గ సమావేశాలకు రాష్ట్రంలోని 26 జిల్లాల జేఏసీ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడుతూ అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులు డిమాండ్ చేయాల్సిన పరిస్థితులు రాకుండానే ఎనిమిది అంశాల్లో సానుకూల నిర్ణయాలను ప్రకటి ంచి, అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వేతన సవరణపై గత ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్ట కుండానే రాజీనామా చేసినందున, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే కమిషనర్‌ను నియమించి నిర్ణీత కాల వ్యవధిలోగా నివేదికను రప్పించుకుని నూతన పీఆర్సీని అమలుచేసేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.

వాస్తవానికి గతేడాది జూలై ఒకటి నుంచే 12వ పీఆర్సీ వేతన స్కేళ్ళు, జూన్ ఒకటి నుంచి ఐఆర్ అమలుకావాల్సి ఉందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పెన్షనర్లకు చెల్లిస్తున్న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ శ్లాబులను గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా తగ్గించి వేసిందని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే పాత శ్లాబుల ప్రకారం పెన్షనర్లకు అదనపు పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి కేవలం వైద్య ఆరోగ్య శాఖలో కొందరికే పరిమితం చేసిందని, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న విద్యాశాఖ వంటి కీలకమైన శాఖలకు కూడా క్రమబద్ధీకరణను వర్తింప జేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తొలగించిన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం వర్తింప జేయాలన్నారు.

బహుళ సంఘాల్లో సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఒక ఉద్యోగి ఒక సంఘంలో మాత్రమే సభ్యత్వం కలిగి ఉండేలా 'రోసా' నియమనిబంధనల్లో మార్పులు చేసి, బహుళ సభ్యత్వాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆయా శాఖల్లో సమస్యలపై పూర్తి అవగాహనతో వ్యవహరించే డిపార్ట్‌మెంట్ సంఘాల నిర్ణయాలకు ఇతర సంఘాలు భిన్నంగా వ్యవహరించే వీలుందని, ముఖ్యం గా కామన్ కేడర్ సంఘాల జోక్యం వల్ల ప్రధానమైన అంశాల్లో అనవసర మైన భిన్నాభిప్రాయాలకు దారితీసే అవకాశముందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం, ఇటీవల రూపాంతరం చెంది కొత్త ఏపీ ఎన్జీవోలుగా మార్చుకుని అన్ని శాఖల్లో గెజిటెడ్ అధికారులకు కూడా సభ్యత్వం తీసుకోమని ఎన్జీవోలు గెజిటెడ్ అధికారులను కోరుతున్న విషయాన్ని ప్రభుత్వం ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఈ నేపథ్యంలో ఏపీజేఏసీ-అమరావతి అనుబంధ సంఘాల్లో సభ్యత్వం ఉన్న సభ్యులెవరూ ఏపీఎన్జీవో, ఏపీజీఈఏ లాంటి కామన్ కేటగిరీ లేదా ఇతర ఏ సంఘాల సభ్యత్వాన్ని తీసుకోరాదని రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానిం చామని వెల్లడించారు. అనంతరం జేఏసీ రాష్ట్ర కోశాధికారిగా పనిచేసిన మురళీకృష్ణ నాయుడు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనను సన్మానించారు. ఆయన స్థానంలో కొత్తగా సంఘ కోశాధికారిగా కనపర్తి సంగీతరావు, కో చైర్మన్లుగా జె.శ్రీనివాస రావు, డీజీ ప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శిగా కె.ఆంజనే యకుమార్‌లను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కో చైర్మన్లు రమణ, శాస్త్రి, శివానందరెడ్డి, కిషోర్‌కుమార్, స్టేట్ ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ పి.లక్ష్మి, సెక్రటరీ జనరల్ పి.విజయలక్ష్మి, జిల్లా జేఏసీ చైర్మన్ కె.రమేష్‌కుమార్, కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉల్లి కిలో రూ.60

కాస్త పెరిగిన చికెన్



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 25: ఉల్లిపాయలు అరవైకి చేరి సామా న్యులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. కర్నూలు ఉల్లి తాడేపల్లిగూడెం మార్కెట్ కి తక్కువగా వస్తుండటం, మహారాష్ట్ర ఉల్లి గిరాకీగా ఉండటంతో ఉల్లిరేట్ల కు కళ్లెం వేసేందుకు అవకాశం లేకపోయింది. దీంతో ఉల్లి ధర ఆకాశాన్నం టింది. రానున్న రోజుల్లో కర్నూలు ఉల్లిపైనే తాడేపల్లిగూడెం మార్కెట్ ఆశలు పెట్టుకుంది. వాటితోపాటు బీర రూ.40, వంకాయ 60-80, చిక్కుల్లు నాటు 100, హైబ్రీడ్ 60, బంగాళ దుంపలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, టమాట రూ.20, అల్లం రూ.150, బెండ రూ.20 దొండ రూ.20, క్యారెట్ రూ.40, దోస రూ.30, కాకర రూ.40, ఆనబ రూ.20, కొత్తిమీర కట్ట రూ.40 పలుకుతోంది. చికెన్ ధరలు గతంతో పోల్చుకుంటే కాస్త పెరిగాయి. గత వారం రూ.180 పలికిన చికెన్ ఈ వారం రూ.220కి విక్రయించారు. పెళ్లిళ్ల సీజన్ మొదలు కావడంతో డీలా పడిన చికెన్ మార్కెట్‌కు ఊరట లభించింది.

సెప్టెంబరు 22 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

నరసాపురం, ఆగస్టు 25: స్వాతంత్ర్య పోరా టంలో బ్రిటిష్‌వారిపై పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధం తిని పురస్కరించుకుని సెప్టెంబరు 22, 23, 24 తేదీల్లో నరసాపురంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బలరాం తెలిపారు. పట్టణంలోని మీరా గ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అల్లూరి పుట్టి న, చదివిన జిల్లాలో ఈ మహాసభల్ని నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ మహాసభలకు కేంద్ర కమిటీ సభ్యులు రాఘవులుతో పాటు రాష్ట్ర నాయకులు మధు, గఫూర్ వంటి ముఖ్య నేత లంతా హాజరవుతారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తామన్నారు. వాటితో పాటు విభజన చట్టం లోని హామీలు, గత ప్రభుత్వం ప్రజలపై మోపిన పన్నుల భారం, రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలు, నిరుద్యోగం, విద్యార్థుల సమ స్యలపై కూడా చర్చిస్తామన్నారు. కె.పెద్దిరాజు, జి.రామ్మోహన్, ఎం.త్రిమూ ర్తులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ అద్నాన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, ఆగష్టు 25 : క్రీడాకారులకు గెలుపోటములు సహజ మని, క్రీడా స్ఫూర్తితో ముం దుకు సాగాలనీ జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం ఆస్మీ అన్నారు. భీమవరం అంగర విజయలక్ష్మి కన్నయ్య ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మెంటే సుబ్బారావు నాగరత్నం మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్ అండర్ 17 బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిసాయి. భీమవరం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. విజేతలకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం ఆస్మీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు , రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారధి. రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అండర్ 17 బాయ్స్ సింగిల్స్ టీ లక్ష్మి స్వేతాన్, బాలికల సిగిల్స్‌లో హసనశ్రీ, అండర్ 17 బాయ్స్ డబు ల్స్‌లో చరణ్‌రామ్, హరికృష్ణ, అండర్ 17 బాలికల డబుల్స్‌లో హసన శ్రీ, చౌదరీలు విజేతలుగా నిలిచారు. మిక్సిడ్ డబుల్స్‌లో సాయి సాహిల్, స్ఫూర్తిలు విజయం సాధించారని నిర్వహకులు తెలిపారు. గెలుపొందిన వారు సెప్టెంబరులో హర్యానాలో జరిగే నేషనల్ బ్యాడ్మింటన్ చాంపీయన్ షిప్ పోటీలలో రాష్ట్రం తరఫున ప్రాతిధ్యం వహిస్తారని చీఫ్ కోచ్ అంగర వెంకటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, గనిరెడ్డి త్రినాథ్, ఐజాక్ బాబు, మెంటే వంశీ, కిషోర్‌తదితరులు పాల్గొన్నారు.

1న అండర్ 14 బాలుర జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, ఆగస్టు 25: పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియే షన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు ఒకటిన ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశా లలో అండర్ -14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఆదిత్యవర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వ్యక్తిగత క్రికెట్ కిట్‌తో ఆ రోజు ఉదయం 9 గంటలకి హాజ రుకావాలన్నారు. క్రీడాకారులు 2010, సెప్టెంబరు ఒకటి తరువాత జన్మిం చి ఉండాలన్నారు. ఆధార్, బోన్‌ఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు తీసుకురా వాలన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపిక చేస్తు న్నట్లు కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు తెలిపారు. మరింత సమాచా రానికి 94910 44848లో సంప్రదించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు.

జ్వరంతో పదో తరగతి విద్యార్థిని మృతి



ఎస్.దుర్గలహరి

ఆకివీడు రూరల్ ఆగస్టు 25 : ఆకివీడులోని పీఎల్ఎస్ జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నిడుమోలు దుర్గలహరి(15) జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం దుంపగడప గ్రామానికి చెందిన ఇటుక బట్టీలలో పనిచేసే నిడుమోలు రాఘరావు, నాగలక్ష్మీ కుమార్తె శనివారం ఉదయం చలి జ్వరంతో ఆకివీడు సీహెచ్‌సీలో జాయిన్ అయ్యిందని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాత్రి సమయంలో వాంతులు విరోచన లు అవుతుండంతో, సిబ్బంది ఇంజక్షన్లు ఇచ్చిన తరువాత శరీరం చల్లబడిపోయి నోటి నుంచి నురుగువ చ్చిందని పేర్కొన్నారు. పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్ళమని వైద్య సిబ్బంది చెప్పడంతో తీసుకెళుతుండగా పెద్ద విరోచనం అయ్యిందని, మార్గమధ్యలోని ఆకివీడులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారన్నారు. ఇదిలా ఉండగా బాలిక తండ్రి, తమ్ముడు జ్వరంతో బాధప డుతున్నా రని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆప్రాంతంలో విషాదఛా యలు అలుము కున్నా యి. అందరితో కలివిడిగాఉండే బాలిక మృతి చెందడం తో తోటి విద్యార్థులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. వైద్య సిబ్బంది తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతుంది.

ప్రాణాపాయ స్థితిలో సచివాలయ ఉద్యోగి



ఏలూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భోగరాజు

ఆకివీడు మండలం సిద్దాపురం సచివాలయంలో ఇంజనీ రింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న భోగరాజు జ్వరంతో ప్రభుత్వాస్పత్రి (యూపీ హెచ్‌సీ)లో జాయిన్ అయ్యారు. తరువాత ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోగా ప్లేట్‌లెట్లు 44 వేలకు తగ్గిపోవడంతో సీహెచ్‌సీలో చేరారు. అక్కడి నుంచి 108లో శనివారం రాత్రి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అయితే అక్కడ వైద్య సిబ్బంది పట్టించుకోక పోవడంతో ప్రైవేటుగా రక్త పరీక్షలు చేయించడంతో ప్లేట్‌లెట్లు 20 వేలకు పడిపోయాయని తెలిపారు. ఈ విషయం ఆస్పత్రి సిబ్బందికి తెలిపినా ఎటువంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఏలూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స అందజేస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉందని, ఆదివారం రాత్రికి నాలుగు యూనిట్లు ప్లేట్‌లెట్లు ఎక్కించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా వైద్య సిబ్బంది తీరుపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విహార యాత్రకు వెళ్లి తిరిగిరాని లోకాలకు



పి.చందు(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 25 : స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లిన పెదతాడేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు (49) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. పెదతాడేపల్లి ఎంపీటీసీగా, ఉప సర్పంచ్ గా పనిచేసిన ఆయన ప్రస్తుత పంచాయతీ పాలకవర్గ సభ్యుడి గా పని చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా గ్రామంలో టీడీపీ పట్టు సాధించేందుకు ఆయన అవిరళ కృషి చేశారు. నియోజకవర్గంలోనే కిలక నేతగా ఉన్న చందు మరణాన్ని కూటమి నాయకులు విస్మయం చెందారు. చందు మృతదేహం స్వదేశం తరలిరావడానికి ఖజకిస్తాన్‌లోని ఇండియన్ ఎంబసి అధికారులతో మంత్రి నారా లోకేష్ మాట్లాడి త్వరగా రప్పించే ఏర్పాట్లు చేస్తున్నా రు. ఆయన మృతికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ, వాడపల్లి వెంకట సుబ్బరాజు తదితరులు సంతాపం తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి సుస్తీ

» అరకొర సిబ్బంది » పని చేయని రక్త పరీక్షల యంత్రం
» అవస్థలు పడుతున్న కార్మికులు

కాయ కష్టం చేసుకుంటూ... ప్రైవేటు సంస్థల్లో కార్మికులుగా పని చేసే వారు అనారోగ్యం బారిన పడితే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ఆస్పత్రికి సుస్తీ చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేక ఈఎస్ఐకి వస్తే ఇక్కడన్నీ సమస్యలే.. ఎందుకొచ్చామా అనేలా తయారైంది తణుకులోని ఈఎస్ఐ ఆస్పత్రి. ఇక్కడ రోగులకు సేవలందిం చేందుకు సరిపడ సిబ్బంది లేరు... రక్త పరీక్షలు చేసే యంత్రాలు పని చేయవు.. కనీసం పరీక్షించేందుకు వైద్యులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండరు. దీంతో రాజమహేంద్రవరం ఆస్పత్రికి రిఫర్ చేయడం పరిపాటిగా మారిపోయింది.



తణుకులోని ఈఎస్ఐ డిస్పెన్సరీ, మూలనపడ్డ రక్తపరీక్షల యంత్రం (ఇన్‌సెట్)

తణుకు, ఆగస్టు 25 : సుమారు ఎనిమిది వేల పైబడి కార్మికులకు వైద్య సేవలు అందించే తణుకు ఈఎస్ఐ డిస్పెన్సరీకి 14 మంది సిబ్బంది ఉండాలి. ఏడుగురు మాత్రమే ఉన్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒక వైద్యుడుని కాంట్రాక్టు పద్ధతిలో నియమిం చారు. మరో వైద్యుడు రాజమహేంద్రవరం నుంచి వారానికి మూడు సార్లు వస్తుంటారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. మిగిలిన పోస్టులు ఎప్పటికి భర్తీ అవుతాయో తెలియని పరిస్థితి. డిస్పెన్సరీకి వచ్చే కార్మికులకు ఒక్క బీపీ మిషన్ మాత్రమే అందు బాటులో ఉంది. రక్తపరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేసే ఎలాంటి మిషన్ లు లేవు. రక్త పరీక్షలు చేసే ఎనలైజర్ యంత్రం మూలనపడింది. రక్త పరీక్షలు చేసే కిట్లు అందుబాటులో లేవు. షుగర్, రక్తపరీక్షలు ఆరు నెలల క్రితం నుంచి ఆగిపోయాయి. దీంతో ప్రతి నెల కనీసం 50 కేసులు రాజమండ్రికి పంపుతుంటారు. మరి అత్యవసరం అయితే విజయవాడకు రిఫర్ చేస్తుంటారు. ఇక మందుల సంగతి సరేసరి. ఒకసారి ఇచ్చిన మందులు మరలా రావడం లేదని కార్మికులు చెబుతున్నారు. దీని వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన మందులు ఎప్పుడు వేసుకోవాలో తెలియడం లేదని కార్మికులు వాపోతున్నారు. మందుల మీద స్టికర్లు అంటిస్తే అవగాహన ఉంటుందని అంటున్నారు. అయితే గైనకాలజిస్టు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆస్పత్రి సమయం మార్చాలి



కరోనా సమయంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడుకు ఆస్పత్రి సమయం మార్చారు. దీని వలన కార్మికులకు వైద్య సేవలు పూర్తిగా అందడం లేదు. అంతకు ముందున్న సమయం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, మరలా సాయంత్రం నాలుగు నుంచి ఆరు వరకు ఆస్పత్రి సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

\- పీవీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

గైనకాలజిస్టుని నియమించాలి



డిస్పెన్సరీలో అన్ని మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గైనకాలజిస్టుని నియ మించాలి. వారం రోజులు మించి సెలవులు ఇక్కడ ఇవ్వరు. ఆపైన సెలవులు కావాలంటే రాజమహే ంద్రవరం వెళ్ళాల్సి ఉంటుంది. దీనివల్ల కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలి.

\- గుబ్బల గోపి, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి

మంచినీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి


డ్రెయిన్ పనుల పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరంటౌన్, ఆగస్టు 25 : పట్టణంలో మంచి నీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం 35వ వార్డులో పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రోజుకు ఒక వార్డును పరిశీలిస్తానని అందులో అక్రమ కట్టడాలు, డ్రెయిన్లు, మంచినీరు, తదితర అంశాలపై పరిశీలన చేస్తానని.. ఆ వార్డుకు సంబంధించిన ఉద్యోగులు అందుబాటులో ఉండాలన్నారు. గుర్తించిన వాటి పరిష్కారానికి వచ్చేనెలలో మళ్ళీవార్డు పర్యటనకు వచ్చేసరికి పూర్తి చేయాలన్నారు. కలుషిత నీరు రాకుండా ప్రత్యేకదృష్టి పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదర్శనగర్ పార్కులో ట్రీ కటింగ్ చేయించాలని, ఈ వార్డులో కచ్చా డ్రెయిన్‌ను తవ్వేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఈ అప్పలరాజు, ఏఈ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీం వద్దు : ఏపీటీఎఫ్

తణుకు, ఆగస్టు 25: కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరిట కొత్త పెన్షన్ పథకాన్ని తీసుకురావడం ఆమోదయోగ్యం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్ అన్నారు. ఆదివారం అయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలన్నారు.

యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు



వీరనారాయణ సెంటర్లో సీపీఐ నాయకుల ఆందోళన

తణుకు, ఆగస్టు 25: ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని, భద్రతా చర్యలు తీసుకోని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆదివారం వీరనారాయణ సెంటర్లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. చనిపోయిన కార్మిక కుటుంబానికి కూడా రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. సీపీఐ నాయకులు బొద్దాని నాగరాజు, పుష్పకుమారి, త్రివిక్రమారావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

'సన్మాన కార్యక్రమం మరువలేనిది'


సమావేశానికి హాజరైన కేంద్రమంత్రి, ఉండి ఎమ్మెల్యే తదితరులు

ఉండి, ఆగస్టు 25 : తమను ఆహ్వానించి సన్మానించడం మరువలేమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం విజయనగరంలో జరిగిన క్షత్రి యూత్ సమావేశానికి కేంద్ర మంత్రి, ఉండి ఎమ్మెల్యే, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజులను ఆహ్వానించి క్షత్రియుల ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం వారు పైడమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కాళ్ల, ఆగస్టు 25 : మత్తు పదార్థాలు, గంజాయికి యువత దూరంగా ఉండాలని కాళ్ల ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. ఏలూరుపాడు గ్రామంలో ఆదివారం పోలీస్ సిబ్బందితో కలిసి యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. అతివేగంగా వాహనం నడిపి ప్రాణాలు కోల్పోతున్నారని, మత్తు పదార్థాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది గ్రామంలో యువత పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పెంటపాడు, ఆగస్టు 25: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించినట్టు మానవత జిల్లా నాయకుడు తాడేపల్లి మోహన్‌రావు తెలిపారు. పెంటపాడులో సుజాత అనే అనాథ మహిళ శనివారం రాత్రి గ్రామంలోని గేటు సెంటర్ వద్ద చనిపోవడంతో తన సొంత ఖర్చులతో మోహనరావు అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటివరకూ తాను ముగ్గురు అనాథలకు అంత్యక్రియలు నిర్వహించానని, ఇది దైవకార్యంగా భావిస్తున్నానని మోహన్‌రావు తెలిపారు. మానవత సభ్యులు తారాడీ పాల్, ఏలూరి వీరాస్వామి, మీసాల సత్యనారాయణ, విప్పర్తి వినాయకుడు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, చెరుకూరి బంగార్రాజు సహకరించారు.

నేడు ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి గుమ్మంపాడు రాక

అత్తిలి, ఆగస్టు 25: గుమ్మంపాడులోని సుబ్రహ్మణ్యేశ్వర గోమహాలక్ష్మి సమేత నారికేళ వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైదరాబాద్ నుంచి టీవీ ప్రవచనకర్త డాక్టర్ ఎన్. అనంతలక్ష్మి సోమవారం ఉదయం విచ్చేస్తున్నారని ఆలయ ఛైర్మన్ పులవర్తి గిరిజ తెలిపారు. ఆమె గీతాప్రవచనాలను భక్తులంతా విని తరించవలసిందిగా కోరారు.

రేపు చిన్నపిల్లల ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం అర్బన్, ఆగస్టు 25: మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఈనెల 27న చిన్నపిల్లలకు ఉచిత గుండెవైద్య శిబిరం నిర్వహిస్తామని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. శిబిరంలో విజయవాడకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ చిన్నారులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. పరిసర గ్రామస్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

కాళ్ల, ఆగస్టు 25 : పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు కాళ్ల ఎస్ఐ ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. ఆదివారం బొండాడపేట గ్రామ శివారు నేరేడు గరువులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద రూ.2,050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజుకు పితృ వియోగం


సుబ్బారావు (ఫైల్)

మొగల్తూరు, ఆగస్టు 25 :టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజుకు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి సుబ్బారావు (86) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. అయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతదేహం వద్ద ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, బండారు మాధవనాయుడు, ముదునూరి ప్రసాదరాజు, పొత్తూరి రామరాజు, సంకు భాస్కర్ నాయుడు, తదితరులు సంతాపం తెలిపారు.

చేకూరి సూరిబాబుకు మాతృ వియోగం


కమల(ఫైల్)

పోడూరు, ఆగస్టు 25 : పోడూరు సొసైటీ మాజీ ఛైర్మన్ చేకూరి సూరిబాబు మాతృమూర్తి కమల(85) ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు భర్త రామ కృష్ణంరాజు, కుమారులు వెంకట నరసింహారాజు, సూర్యనారాయణరాజు, సాయిబాబా వర్మ ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె గ్రామంలోని అనేక మంది పేద మహిళలకు వస్త్ర, ధన రూపేణా సాయం చేసి ప్రజల హృదయాల్లో దానశీలిగా పేరుపొందారు. ఆమె మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆచంట మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామ రాజు, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు సంతాపం తెలిపారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు


రామరాజును సత్కరిస్తున్న తోట సీతారామలక్ష్మి, పార్టీ నాయకులు

భీమవరం అర్బన్, ఆగస్టు 25 : పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులు కేటాయిస్తారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. భీమవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో టీడీపీ పట్టణ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన రామరాజును పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, పార్టీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ళ నాగేశ్వరరావు శాలువాతో సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలోని 39 వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ద్వారా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ యాప్ ద్వారా సోషల్ మీడియా ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గంలో మొదటి ఆరు స్థానాల్లో స్థానం సాధించిన మరపట్ల శ్యాంబాబు, గాదిరాజు నారాయణ రాజు, రేవు జనార్దన్, కడలి విజయ్‌కుమార్, బొమ్మిడి ధర్మరాజు, గాడిపల్లి సందీప్ కుమార్‌లకు చంద్రబాబు పంపించిన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు వి.శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, సీనియర్ నాయకులు మెరగాని నారాయణమ్మ, ఇందుకూరి రామలింగరాజు, గనిరెడ్డి త్రినాథ్, పామర్తి వెంకటరామయ్య, గంటా త్రిమూర్తులు, ఎద్దు ఏసుపాదం, ఐజాక్ బాబు, మద్దుల రాము, చల్లబోయిన సుబ్బారావు, గోవింద్, బొక్క సూరిబాబు, జంపన ధనరాజ్, మాదాసు కనకదుర్గ, ఎం.డి. షబీనా, గంధం రాధా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి సీపీఎం నేత శ్రీరామ్మూర్తి : నిమ్మల


సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 25 : పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వలవల శ్రీరామ్మూర్తి ఆదర్శమూర్తిగా చరిత్రలో నిలిచి ఉంటారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన సీపీఎం, యూటీఎఫ్ నేత శ్రీరామ్మూర్తి సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఏదో ఒక పథకానికి శ్రీరామ్మూర్తి పేరు పెట్టడానికి కృషి చేస్తానన్నారు. శ్రీరామూర్తి కళ్ల ఇద్దరికి దానం చేయడం, శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనకు ఇవ్వడం పట్ల కుటుంబ సభ్యులను అభినందించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పార్టీలో చేరిన శ్రీరామ్మూర్తి ఎందరికో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏలూరు అరట్లకట్ల రవి, చింతకాయల బాబూరావు, జేఎన్‌వీ గోపాలన్, కేవీ సీతారామ్, గోపీకృష్ణ, ఏకేవీ రామభద్రం తదితరులు పాల్గొన్నారు.

కండీషన్‌లో వున్న బస్సులు నడపాలి


ఆకివీడు బస్టాండ్‌లో బస్సు టైరు మారుస్తున్న దృశ్యం

ఆకివీడు, ఆగస్టు 25 : ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం కండీషన్‌లో వున్న బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. భీమవరం డిపోకు చెందిన ప్యాసింజర్ బస్సు భీమవరం నుంచి ఏలూరు ఆదివారం ఉదయం బయలుదేరింది. ఆకివీడు కొత్త బస్టాండుకు వచ్చే సరికి బస్సు వెనుక టైరుకు గాలి తగ్గడంతో ప్రయాణికులను కిందకు దింపి టైర తీశారు. ఇదే బస్సులో ఏలూరులో ఐబీపీఎస్ పరీక్ష రాసేందుకు పలువురు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలు, మోటారు సైకిళ్లపై వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తితంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామ స్వరాజ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం కృషి

భీమవరంటౌన్, ఆగస్టు 25 : మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావడానికి రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండపల్లి రమేష్‌నాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలపై హర్షం వ్యక్తం చేస్తూ సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించి ముందడుగు వేసిందని కొనియాడారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పాలన ముఖ్యమైనదని, గ్రామీణ ప్రజలు గ్రామాభివృద్ధికి తమకు ఏం కావాలో చెప్పుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చల్లా రాము, న్యాయవాది ఆర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో హామీల అమలు అభినందనీయం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 25 :రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడం అభినందనీయమని రాహుల్ సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయాబ్ రసూల్ అన్నారు. ఆదివారం సేవా సంస్థ సభ్యులతో కలిసి మాట్లాడారు. పేదలకు కడుపు నిండే విధంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం రూ.5 చొప్పున అందించడం సంతోషకరన్నారు. మార్కెట్ ధరల మేరకు టిఫిన్ రూ. 10, భోజనం రూ.15 తీసుకుంటే ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉండదని, పేదలు సంతోషంగా స్వీకరిస్తారన్నారు. షేక్ సుభాన్, జీవీ సత్యనారాయణ, షేక్ కాజా మహీద్దీన్, జి.లక్ష్మీ నరసింహ రావు, కారుమంచి భూషణం పాల్గొన్నారు.

29న పూర్వ విద్యార్థులు హాజరవ్వాలి


వీవీ గిరి కళాశాల సమావేశంలో పూర్వ విద్యార్థులు

ఆకివీడురూరల్ ఆగస్టు 25 : దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న నాక్ పర్యటన సందర్భంగా పూర్వపు విద్యార్థులు హాజరవ్వాలని పూర్వ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఆదివారం కాలేజీలో సమావేశమైన పూర్వ విద్యార్థుల సంఘం ఆ రోజు చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. చదువుకున్న కాలేజీ కోసం రెండుగంటలు కేటాయించాలని, నాక్ సభ్యులతో ముఖాముఖి ఉంటుందని వారు తెలిపారు. ప్రిన్సిపాల్ సుజాత, సీడీసీ ప్రతాప్‌కుమార్, గొంట్లా కృష్ణమూర్తి, కాకర్ల రాజరాజేశ్వరి, అప్పలస్వామి, కట్రెడ్డి వాసు, భైరి సింహాచలం, సిరాజుద్దీన్, రామకృష్ణ, కోటేశ్వరరావు, నేరెళ్ళ రామచెంచయ్య, సీహెచ్ సీతారామరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పెద్దింట్లమ్మకు సారె


సారె సమర్పిస్తున్న భక్తులు

ఆకివీడు, ఆగస్టు 25 : ఆకివీడు పెద్దింట్లమ్మకు స్థానిక 13వ వార్డుకు చెందిన భక్తులు ఆదివారం శ్రావణమాస సారె సమర్పించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

- ఆకివీడు ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ఆదివారం కల్కి భగవాన్ భక్తుల ఆధ్వర్యంలో సుమంగళి పూజలు నిర్వహించారు. సుమారు 300 మ హిళలు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు భోజన ప్రసాదం అందంచారు. కార్యక్రమంలో గొంట్లా కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.
- ఆచంట : పెదమల్లం మాచేనమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.
- పాలకొల్లు అర్బన్ : స్థానిక అచ్చుగట్లపాలెం లయన్స్ కంటి ఆసుపత్రి వెనుక రోడ్డులో ఈనెల 28వ తేదీన నూతనంగా నిర్మించిన శ్రీసాయి గాయత్రి నూతన ఆలయం ప్రారంభం చేస్తున్నట్టు నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి నాగులకొండ గోపి సత్యనారాయణ, శాంతరత్న దంపతులచే విగ్రహాల ప్రతిష్ఠ చేస్తారన్నారు. దీనిలో భాగంగా మంగళవారం నుంచి పలు కార్యక్రమాలు ఉంటాయని, 28న బుధవారం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

అన్ని దానాల్లో కంటే అన్నదానం గొప్పది


అన్నదానం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, ఆగస్టు 25 : అన్నిదానాల్లో కంటే దానం ఎంతో గొప్పదని, దైవ కార్యక్రమాల్లో అన్నసమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులోని శ్రీనివాస సెంటర్‌లో ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల జాతరలో భాగంగా అమ్మవారి జాతర కమిటీ ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించి మహానివేదన చేసి అన్నసమారాధనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, పిప్పళ్ళ ప్రసాద్, యలమంచిలి శ్రీనివాస్, గోపి, ప్రసాద్, రాంబాబు, సోముకుమార్, సాయి గణేష్, కాపు దుర్గారావు, నాగబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ


సరస్వతి దేవి విగ్రహావిష్కరణలో క్లబ్ సభ్యులు

భీమవరంటౌన్, ఆగస్టు 25 : పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలోని ఆడబాల చంద్రరావు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో భీమవరం వాసవీ క్లబ్ వారిచే సరస్వతి దేవి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటీ ఎల్ఎన్వీ ప్రసాద్‌చే విగ్రహావిష్కరణ చేసి వలివేటి కల్పన జ్యోతి ప్రజ్వలన చేశారు. కొత్త మహాలక్ష్మి జ్ఞాపకార్థం భర్త కొత్త రాధాకృష్ణమూర్తి సరస్వతి దేవి విగ్రహాన్ని అందించారు. జిల్లా గవర్నర్ ప్రసాద్ మాట్లాడుతూ చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొండాడ రాంపండు, కొత్త రాధాకృష్ణమూర్తి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పూసరపు సత్యనారాయణ, కార్యదర్శి రాచపూడి శ్రీనివాస్, కోశాధికారి కొప్పరపు రవికుమార్, కొత్త శ్రీను, బొండా రాంబాబు, ఓలేటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

లో-వోల్టేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు

కాళ్ల, ఆగస్టు 25 : దొడ్డనపూడిలో లోవోల్టేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని కాళ్ల మండలం విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు తెలిపారు. గ్రామంలో లో-వోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఉన్నత అధికారులను గ్రామస్థులు ఆశ్రయించిన దృష్ట్యా ఆదివారం అధికారులు గ్రామంలో ప్రతీ ఇంటిని పరిశీలించినట్టు తెలిపారు. గ్రామంలో లో-వోల్టేజీ సమస్య పరిష్కారం నిమిత్తం గతంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఇంకా గ్రామంలో ఏదైనా విద్యుత్ సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలిపితే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తాం

ఉండి, ఆగస్టు 25: రాబోయే వినాయక చవితి పండుగకు ఉచిత మట్టి వినాయక ప్రతిమలు భక్తులకు పంపిణీ చేస్తామని మానవత సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స రామకృష్ణంరాజు, గాదిరాజు రంగరాజు తెలిపారు. ఆదివారం కలిగొట్లలో మానవతా సంస్థ సమావేశం మండల మానవత సంస్థ ఛైర్మన్ రుద్రరాజు యువరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ద్వారా సమాజానికి దోహదపడే కార్యక్రమాల ప్రణాళికను రూపొందించామన్నారు. అనంతరం పీహెచ్‌డీ పొందిన గాదిరాజు రంగరాజును పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో డి.రామలింగేశ్వరరావు, సాగిరాజు విజయ్, యశోదకృష్ణ, మున్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోవాలి

నరసాపురం టౌన్, ఆగస్టు 25: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగపర్చుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని బీజేపీ కన్వీనర్ మేకల సతీష్ కోరారు. ఆదివారం డ్వాక్రా కార్యాలయంలో జరిగిన ప్రధానమంత్రి ఎంప్లాయింట్ జనరేషన్ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన లక్‌పతిదీదీ పథకంలో భాగంగా శిక్షణ పొందిన ప్రతి మహిళకు 1.20లక్షల రుణం అందిస్తారన్నారు. ఏపీఎం పద్మ, వాతాడి ఉమా, నడిపూడి పండు, మునికోటి వెంకటేశ్వరావు, సీసీ, వీవోలు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు బంగారం అందజేత


మావుళ్ళమ్మకు బంగారం అందజేస్తున్న దాత

భీమవరంటౌన్, ఆగస్టు 25 : మావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన విద్యాచైతన్య శ్రీనివాస దీప్తి 8 గ్రాముల బంగారం అందజేశారు. తొలుత దాత అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ వారి కుటుంబసభ్యుల పేరిట పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు. దేవస్థానం తరపున శేషవస్త్రాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అందజేశారు.

నేడు ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి పూజలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 25 : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక యర్రవంతెన వద్ద గల శ్రీకృష్ణుని ఆలయం వద్ద సోమవారం ఉదయం ఆరు గంటలకు స్వామికి పంచామృతాభిషేకాలు, అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, పూజలు మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు 12 ఏళ్ళ లోపు చిన్నారులకు చిన్నికృష్ణుడు, గోపికమ్మ వేషధారణ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం యువకులచేత ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇయ్యపు బాస్కరరావు, కోశాధి కారి ముగడ శ్రీనివాస్ తెలిపారు. శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు, గోపురం వద్ద ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. శంభన్న అగ్రహారంలోని ఆలయంలో చిన్నారులచే గోపికలు, చిన్ని కృష్ణుడి వేషధారణ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

- ఉండి: ఉండి పడవలరేవులో వారాల జాతరను ఆదివారం స్థానికులు వైభవంగా నిర్వహించారు. పంటలు బాగా పండాలని ఆయా కుటుంబాలు అభివృద్ధి సాధించాలని అమ్మవార్ల ఆలయాల్లో పూజలు చేశారు. టీడీపీ నాయకుడు సారేపల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.
- మొగల్తూరు : మొగల్తూరులోని బండి ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కావాల్సిన సదుపాయాలను ఈవో డి.రామకృష్ణంరాజు ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.


భట్లమగుటూరు, ఆలమూరు గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

» మద్యం బాబులకు అడ్డాగా మారిన వైనం

పెనుమంట్ర, ఆగస్టు 25 : గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి వర్మీ కంపోస్టుగా రీసైక్లింగ్ చేసే ఉద్దేశంతో గతంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ కేంద్రాల వైపు చూసిన పాపాన పోలేదు. కొన్ని గ్రామాల్లో రీసైక్లింగ్ యంత్రాలు కొనుగోలు చేసి ఏర్పాటు చేసినప్పటికీ మిషన్లు అలంకార ప్రాయంగానే పెట్టారు తప్ప రీసైక్లింగ్ చేయలేదని ఆరోపణలు విని పిస్తున్నాయి. మండలంలో పాలమూరు, భట్లమగుటూరు, ఆలమూరు, సత్యవరం, వెలగలేరు, కొయ్యేటిపాడు, మాముదూరు, సోమరాజు ఇల్లెందులపర్రు, నెలమూరు, ఓడూరు గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల్లో యువకులు సాయంత్రం వేళల్లో మద్యం తాగేందుకు ఉపయోగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఏర్పడిన కూటమి ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలను ఉపయోగించి ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్ నాగరాణి గ్రామ పంచాయతీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు చెత్త సంపద కేంద్రాల ద్వారా సంపద సృష్టించే దిశగా అడు గులు పడతాయా లేదా అనేది వేచి చూడాల్సిందే.

పార్టీలకు అతీతంగా సీఎం సహాయ నిధి : నాయకర్


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం టౌన్, ఆగస్టు 25: పార్టీలకు అతీతంగా సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ సాయం అందిస్తామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో రామన్నపాలెంకు చెందిన సరస్వతికి ఎల్‌ఓసీ ద్వారా రూ. 2.60 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును అం దించారు. చాలారోజుల మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న ఆమెకు వైద్యులు రూ. 4లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఎమ్మెల్యేకు సమస్యను వివరించడంతో ఆయన స్పందించి సాయం అందించారు. కోటిపల్లి వెంకటేశ్వరావు, ఎలీషా, ఆజా, చందు, నరేష్, నాగులు, దుర్గాప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

వైఎన్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు జాతీయ పురస్కారం


ప్రిన్సిపాల్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

నరసాపురం టౌన్, ఆగస్టు 25: వైఎన్ కళాశాల బీఈడీ ప్రిన్సిపాల్ పిట్టా శాంతికి జాతీయ ప్రతిభ పురస్కారం లభించింది. గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్ల ఆర్గనైజేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. శనివారం రాత్రి గుంటూరు ఆంధ్రా క్రైస్తవ కళాశాలలో ఎమ్మెల్సీ ఎస్. లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు నజీర్, గల్లా మాధవి, నాగర్జున యూనివర్సిటీ ఆచార్యులు రత్నశీలమణి, ఈసీ మెంబర్ కన్నా చేతుల మీదుగా శాంతి పురస్కారాన్ని అందుకున్నారు. ఆమెను కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు, పాలకవర్గ సభ్యులు స్వామినాయుడు, ప్రిన్సిపాల్ కనకరావు, డైరెక్టర్లు చింతారావు, గంథం రామకృష్ణ అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు

నరసాపురంలో 300 మందికి..


నరసాపురంలో గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు

నరసాపురం, ఆగస్టు 25; గుండె జబ్బుకు వయస్సుతో సంబంధం లేదని ఏ వయస్సు వారికైన రావచ్చని ప్రముఖ వైద్యుడు, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం లయన్స్ భవనంలో నిర్వహించన ఉచిత గుండె జబ్బుల పరీక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి విజయవాడకు చెందిన స్వర సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి వెద్యులు గుండెకు సంబంధించిన ఏకో, ఈసీజీ, పరీక్షలు చేశారు. 50 మందికి ఎకో పరీక్ష అవసరమని గుర్తించారు. లయన్స్ క్లబ్ సభ్యులు సుంకర రమేష్, చిట్టిబాబు, ప్రతాప్, నళిని, మూర్తి తదతరులు పాల్గొన్నారు.

తణుకులో ఎనిమిది మంది వృద్ధులకు..

తణుకు :సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా వైద్య సేవలు నిర్వహించారు. నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య కలసి తణుకు, సజ్జాపురం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఎనిమిది మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. సంస్థ సభ్యుడు మస్తాన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు.

సిద్ధాపురంలో 124 మందికి..

ఆకివీడు రూరల్: సిద్ధాపురంలో ఆదివారం లయన్స్‌క్లబ్, ఆదర క్లబ్‌ల ఆధ్వర్యంలో ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ప్రముఖ నేత్ర వైద్యుడు పి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో 124 మందికి పరీక్షలు నిర్వహించగా 23 మందికి కళ్లజోళ్లు, 18 మందికి ఆపరేషన్ల నిమిత్తం సిఫార్సు చేశామన్నారు. సర్పంచ్ చిట్టిబాబు, గొంట్లా కృష్ణమూర్తి, వీవీ కృష్ణంరాజు తదితరులున్నారు.

పాలకొల్లులో 200 మందికి

పాలకొలు రూరల్ : స్థానిక తిరుమల హాస్పటల్స్ ఆధ్వర్యంలో డాక్టర్ వట్నూరి రమేష్ ఆదివారం టిడ్కో గృహాలలో నివసిస్తున్న ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. యాతం రమేష్, పి.రవికుమార్, దొంగ ప్రసాద్, కొమ్ముల కాశీ విశ్వనాథ్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో వంద మందికి..

భీమవరం అర్బన్ : జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపును ఆదివారం మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు సందీప్ వర్మ, డాక్టర్ సత్యనారాయణరాజు వంద మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. తదుపరి ఈ ఉచిత క్యాంపు నవంబరు 24న జరుగుతుందన్నారు.

పెనుమంట్ర మండలం గరువులో 30 మందికి..

పెనుమంట్ర, : పెనుమంట్ర మండలం గరువులో విజయవాడ వైవీ రావు ఉషా కార్డియాలజి వైద్యులు, వైద్యురాలు శిరీష ఆధ్వర్యంలో ఆదివారం 30 మంది రోగులకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ కర్రి సుబ్బారెడ్డి, సత్తి సత్యానందరెడ్డి, కొనగళ్ళ వెంకట్రావు, సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు తమనంపూడి దుర్గా శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.